అవినీతిని రూపుమాపాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌పీసీఎల్ సిబ్బంది

ఘట్‌కేసర్: అంకుషాపూర్‌లో హెచ్‌పీసీఎల్ పైప్ లైన్ వారి ఆధ్వర్యంలో గురువారం విజిలెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. అలాగే స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవినీతి నిర్మూలనపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లంచం ఇవ్వడం, తీసుకోవడం నేరమని, ముందస్తు సమాచారం ఇస్తూ చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని, వారితోనే లంచగొండితనం నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ సిబ్బంది నాగఅయ్యప్ప, హెచ్‌ఎం వరలక్ష్మీ, విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



మేడ్చల్: ఎయిడ్స్ వ్యాధిపై మేడ్చల్‌లో వైఆర్‌జీకేర్ సంస్థ వారు జిల్లా గ్రంథాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి లక్షణాలు, వ్యాధి సోకే పనులు వంటివి వివరించి కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు యశోద, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనుల వివరాలు తెలుసుకుంటున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: స్వచ్ఛభారత్‌లో భాగంగా పట్టణంలో పారిశుద్ధ్య కార్మికుల పనులను మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య గురువారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. దుకాణ యజమానులు ప్రధాన రహదారిపై చెత్త వేయకుండా చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, చెత్తను సేకరించే వాహనంలోనే చెత్తను వేసే విధంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జంగయ్య యాదవ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, రాజేష్, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



కీసర: చీర్యాల చౌరస్తాలో గురువారం ఓ ట్యాంకరు లారీకి మంటలు అంటుకుని తృటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్లితే.. నగరంలోని గచ్చిబౌలి నుంచి చర్లపల్లికి ఫ్యూయల్ ఆయిల్ లోడుతో వచ్చిన ట్యాంకరు లారీ ఖాళీ చేసి తిరిగి వెళ్తుండగా.. సరిగ్గా చీర్యాల చౌరస్తాకు రాగానే డీజిల్ పైపు బ్లాస్టయి ముందు చక్రం వద్ద మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్, క్లీనర్ లారీని రోడ్డు పక్కకు నిలిపారు. అటుగా వెళ్తున్న వాహనదారులు భయంతో దూరంగా వెళ్లిపోయారు. కొందరు వాహనదారులు ధైర్యం చేసి మంటలను ఆర్పారు. తృటిలో ప్రమాదం తప్పిందని, లేదంటే లారీకి మంటలు వ్యాపించి ట్యాంకు పేలిపోయేదని స్థానికులు తెలిపారు.

గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలి



పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యులు

శామీర్‌పేట్: గాలికుంటు టీకాలను పశువులకు తప్పనిసరిగా వేయించాలని మండల పశు వైద్యాధికారి బిక్యానాయక్ అన్నారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం మండలంలోని మజీద్‌పూర్, బాబాగూడ గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలోని పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలను వేసి, జియో ట్యాగింగ్ చేసి, ఆన్‌లైన్ చేస్తున్నామని వివరించారు. ఈ నెల 15 నుంచి నవంబర్ 25 వరకు టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని, రైతులందరూ తమ పశువులకు టీకా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశు వైద్యులు భాస్కర్, బస్వరాజ్, ఖాజా మొహినుద్దీన్, జగదీశ్వరి, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఒకరు మృతి

శామీర్‌పేట్: ద్విచక్రవాహన దారులు విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన బుధవారం రాత్రి శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రేమ్‌నగర్, బొల్లారంకు చెందిన బ్రహ్మయ్య (44), నరసింహ ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై తూంకుంట మున్సిపాలిటీ బాబాగూడకు పని నిమిత్తం బుధవారం రాత్రి వస్తున్నారు. ఈ క్రమంలో బాబాగూడ రోడ్డులోని మూలమలుపు వద్ద ఉన్న విద్యుత్ స్తంభాన్ని ప్రమాదవశాత్తు ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో బ్రహ్మయ్య అక్కడికక్కడే మృతిచెందగా నరసింహకు తీవ్ర గాయాలుకాగా చికిత్స నిమిత్తం హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం కొరకు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభమెప్పుడు?

- వర్షానికి తడుస్తున్న ధాన్యం
- కొనుగోలు కేంద్రాల వద్దే ధాన్యం కుప్పలు
- మిల్లర్లు, ప్రభుత్వం మధ్య వాదనలతో సందిగ్ధతలో రైతన్నలు
- కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న రైతులు



కొనుగోలు కోసం ఎదురుచూపులు

ఘట్‌కేసర్: ఎదులాబాద్, మాదారంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నేటికి గింజ కొనుగోలు చేయలేదు. పంట దిగుబడిని కుప్పలు పోసి 20 రోజులు కావస్తున్నా కొనుగోలుపై సందిగ్ధత నెలకొంది. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షానికి పండించిన ధాన్యం తడిసిపోతోంది. నానిన ధాన్యం ఆరబెట్టడానికి కూలీల వ్యయం, ధాన్యం కుప్పలకు అవసరమైన ప్లాస్టిక్ కవర్ల అద్దె రైతులకు తలకు మించిన భారం అవుతోంది. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ. 2,320, కామన్ 2,300 గేడ్‌కు మద్దతు ధర ప్రకటించింది. అన్నదాతలు పండించిన పంట దిగుబడిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలన్న ప్రభుత్వ ప్రకటనలు క్షేత్ర స్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెట్టడానికి కుటుంబ సభ్యులే కాకుండా కూలీలు, ప్లాస్టిక్ కవర్లుకు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. అధికారులు సమయానికి కొనుగోలు చేస్తే రైతులకు అదనపు వ్యయ భారం తప్పేదని అంటున్నారు. మిల్లర్లకు ప్రభుత్వానికి బియ్యం లెక్కల్లో తేడా ఉండడంతోనే కొనుగోళ్ల ఆసల్యం అవుతుందని అధికారులు అంటున్నారు. క్వింటాలు ధాన్యానికి 67 కిలోల బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం కోరుతోంది. కాని సన్న ధాన్యానికి 64–65 కిలోలకు మించి రాదని మిల్లర్లు అంటున్నట్లు సమాచారం. బియ్యం లెక్కల్లో సందిగ్ధత నెలకొనడంతో ధాన్యం కొనుగోలు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం, మిల్లర్ల సమన్వయం లోపంతో రైతులు నష్టపోతున్నారని, అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని కోరుతున్నారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారిని వివరణ కోరగా చర్చలు సాగుతున్నాయని కొనుగోళ్లు త్వరలో ప్రారంభం అవుతాయన్నారు.

రైతులను మోసం చేస్తున్నారు



ధాన్యం కుప్పలు పోసి సుమారు నెల కావస్తోంది. వర్షానికి తడిసిన ధాన్యం తిరిగి ఆరబెట్టడానికి కవర్ల అద్దె మోపెడవుతుంది. ఏవేవో సాకులు చెప్పి రైతులను మోసం చేస్తున్నారు.

-పుష్పమ్మ, రైతు మాదారం

ప్రభుత్వం నిర్ణయంతో నష్టపోతున్నాం



మిల్లర్లు, ప్రభుత్వం మధ్యన నెలకొన్న సందిగ్ధత రైతుల కొంపముంచుతుంది. ఇద్దరి మధ్యన రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుతం గోదాములు కూడా లభించడం లేదంటున్నారు.

-వెంకటయ్య, రైతు మాదారం

వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలి



ధాన్యం కేంద్రాన్ని ప్రారంభించి 20 రోజులైంది. మిల్లర్లు, ప్రభుత్వం వాదించుకుంటూ రైతులను నష్టపరుస్తున్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి.

-శోభారాణి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు

నర్సింహారెడ్డి కళాశాలలో వర్క్‌షాప్



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న కళాశాల కార్యదర్శి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డుల రూపకల్పనపై వర్క్‌షాప్ నిర్వహించారు. డేటా పాయింట్ సహకారంతో ఈసీఈ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ పరికరాలకు పీసీబీలు వెన్నుముక్క వంటివన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డైరెక్టర్ మోహన్‌బాబు, హెచ్‌ఓడీ పురుషోత్తం, కోఆర్డినేట్ పవిత్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

కీసర: కీసరలోని మహాత్మా జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సుకు గెస్ట్ లెక్చరర్ కావాల్సి ఉండటంతో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వనజాత తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్‌లో పీజీతో పాటు ఏదైనా స్పెషలైజేషన్ కలిగిన అభ్యర్థులు ఈ నెల 25 నుంచి వచ్చే నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9515965484, 7981587773 నెంబర్లలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సైన్స్‌కు టెక్నాలజీ తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రక్షవీర్ జస్రా, బిట్స్ పిలానీ డైరెక్టర్ సౌమ్యో ముఖర్జీ

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ బిట్స్ పిలానీ క్యాంపస్‌లో డైమండ్ జూబ్లీ వేడుకల్లో భాగంగా గురువారం ఇండస్ట్రీ, ఫెర్టిలైజేషన్‌పై ఇండో–ఫ్రెంచ్, బిట్స్ పిలానీ సంయుక్తంగా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రక్ష వీర్ జస్రా హాజరై మాట్లాడుతూ.. యువ శాస్త్రవేత్తలు సురక్షితమైన, సమర్థవంతమైన ఉత్ప్రేరకాల ప్రక్రియ వైపు పరిశోధనలు చేయాలన్నారు. సైన్స్‌కు టెక్నాలజీ తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా యువ శాస్త్రవేత్తలు నూతన ఆలోచనలతో ఉత్ప్రేరకాలు తయారు చేయాలన్నారు. ఈ సదస్సులో 120 మంది రీసెర్చ్ స్కాలర్స్, ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బిట్స్ పిలానీ డైరెక్టర్ సౌమ్యో ముఖర్జీ, జయంతి సుబ్బలక్ష్మీ, బిట్స్ పిలానీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, లక్ష్మాపూర్ గ్రామంలో మెడిసిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 128 మందికి పరీక్షలు నిర్వహించి, 42 మందిని ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగిందన్నారు. డాక్టర్లు అభిషేక్, వరుణ్, సౌరబ్, నిశాంత్, మార్కెట్ ఇన్‌చార్జి కుమారిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పోచారం: మున్సిపాలిటీలో విలీనమైన కొర్రెముల, వెంకటాపూర్, చౌదరిగూడ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను చైర్మన్ కొండల్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కాలనీలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కాలనీవాసులను కోరారు. కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది, బాలాజీనగర్, ప్రత్యూష కాలనీ వాసులు పాల్గొన్నారు.

శరవేగంగా కొనసాగుతున్న
రహదారి విస్తరణ పనులు



శరవేగంగా కొనసాగుతున్న రాంపల్లి-చర్లపల్లి రహదారి విస్తరణ పనులు



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో గల వివిధ ప్రధాన రహదారుల విస్తరణ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. దీంతో ఏళ్ల తరబడి రహదారుల బాగుకోసం వేచిచూసిన ప్రజల కళ నెరవేరనుంది. చర్లపల్లిలో రైల్వేశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన కొత్త రైల్వేస్టేషన్ పనులు దాదాపు పూర్తికావడంతో త్వరలో ఈ రైల్వేస్టేషన్ ప్రారంభం కానున్నది. దీంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రయాణికులు చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో హెచ్‌ఆర్‌డీసీఎల్ ద్వారా చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు సులువుగా ప్రయాణికులు చేరుకునే విధంగా నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలో గల 6 రహదారులను రూ. 254 కోట్ల నిధులను వెచ్చించి రాంపల్లి చౌరస్తా నుంచి-యంనంపేట, రాంపల్లి- చర్లపల్లి బీఎస్ఎన్ఎల్ వరకు, రాంపల్లి-కరీంగూడ ఓఆర్ఆర్, రాంపల్లి-సాయిగూడెం ఓఆర్ఆర్, దమ్మాయిగూడ రోస్‌గార్డెన్ నుంచి నాగారం వరకు, నాగారం డబుల్ బెడ్‌రూమ్ నుంచి యంనంపేట వరకు రోడ్డు విస్తరణ పనులను చేపడుతోంది. ఈ రహదారుల విస్తరణ పనుల్లో భాగంగా ప్రస్తుతం రాంపల్లి-చర్లపల్లి వరకు రహదారి విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మరో పక్క రాంపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి యంనంపేట రహదారి, సాయిగూడెం నుంచి రాంపల్లి వరకు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల తొలగింపు, ఇటాచీతో రోడ్డు చదును చేసే పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న రహదారులను 100 అడుగుల రహదారులుగా విస్తరించడంతోపాటు, నాలుగులైన్ల రహదారులుగా విస్తరించి రోడ్డు మధ్యలో డివైడర్, చెట్లు, వీధి దీపాల ఏర్పాటు, రెండువైపుల వాకింగ్ ట్రాక్ తదితర పనులను చేపట్టనున్నట్లు హెచ్‌ఆర్‌డీసీఎల్ సంస్థ డీఈ విజయ్‌కుమార్ తెలిపారు. త్వరలో చర్లపల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ రహదారులను విస్తరించి రైల్వేస్టేషన్‌కు ప్రయాణికులు త్వరగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరుకోవడానికి ఈ రహదారులను విస్తరించి అభివృద్ధి పరచడం జరుగుతుందన్నారు. తమ ప్రాంత రహదారులు బాగుపడుతుండటంతో నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల ప్రజలతోపాటు, రాంపల్లి, కరీంగూడ, యంనంపేట, చర్లపల్లి ప్రాంతాలకు చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భూసారానికి అనుగుణంగా పంటలను వేయాలి





రైతులకు భూసార పరీక్ష ఫలితాలను అందజేస్తున్న ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు

శామీర్‌పేట్: భూసారానికి అనుగుణంగా పంటలను వేయాలని, తద్వారా అధిక దిగుబడిని పొందవచ్చని ఇక్రిశాట్ శాస్త్రవేత్త డా. పుష్పజీత్ చౌదరి అన్నారు. లారస్ ల్యాబ్స్, ఇక్రిశాట్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా, మూడుచింతలపల్లి మండలం, కొల్తూర్ గ్రామంలోని రైతుల పొలాల్లో భూసార పరీక్షలు నిర్వహించి గురువారం ఫలితాలను రికార్డు రూపంలో రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి రైతు తప్పనిసరిగా భూసార పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. భూసారానికి అనుగుణంగా ఎరువులను ఉపయోగించాలని వివరించారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు రైతుల ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇక్రిశాట్ మేనేజర్ విజయ రంగనాథ్, ఏడీఏ, మండల వ్యవసాయాధికారి రవి, మాజీ సర్పంచ్ శిల్ప, ఇక్రిశాట్ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పరిపాలన అస్తవ్యస్తం



తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: మాదారం, ఎదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్షానికి రైతులు ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని, ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. కేంద్రాలు ఏర్పాటు చేసి 20 రోజులైన తూకం ప్రారంభించలేదన్నారు. వెంటనే ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించాలని, లేని పక్షంలో ప్రభుత్వ అలసత్వంపై రైతులతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎసీఎస్ డైరెక్టర్ పోచిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కుమార స్వామి, లక్ష్మణ్‌రావు, మాజీ సర్పంచ్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర విద్యుత్ స్తంభాలను తొలగించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బాబాగూడ గ్రామస్తులు

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీలోని బాబాగూడ- శామీర్‌పేట రోడ్డులో ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయని బాబాగూడ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం శామీర్‌పేట విద్యుత్ ఈడీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. బాబాగూడ రోడ్డులోని కొండయ్యబావి, మజీద్ వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలకు ఢీకొని వాహన దారులు ఐదుగురు మృతిచెందారని వాపోయారు. ఇదే విషయాన్ని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు మాత్రం తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. మరిన్ని ప్రమాదాలు జరగక ముందే విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, బాల్‌రెడ్డి, స్వామి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ





కీసర: కీసరలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో నిర్మించిన ఆలయంలో గురువారం పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని గ్రామ పురవిధుల్లో ఊరేగించి అనంతరం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమం, కళ్యాణోత్సవంలో బండారి శంకర్‌గౌడ్‌తోపాటు, ఆలయ నిర్మాణానికి సహకరించిన జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బెలిదేరమేష్‌గుప్తా, మాజీ సర్పంచ్ మాధురి వెంకటేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దు



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

బోడుప్పల్: చెంగిచర్ల ద్వారకానగర్ ఫేస్–2 కాలనీలో సెల్‌టవర్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆ కాలనీవాసులు గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు సంతోష్ పాటిల్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి మాట్లాడుతూ సెల్‌టవర్‌ను ఏర్పాటు చేయవద్దని ఇప్పటికే అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా, బోడుప్పల్ కమిషనర్ రామలింగం, మేయర్ అజయ్‌యాదవ్‌కు వినతి పత్రం అందజేసినా అనుమతులు మంజూరు చేశారన్నారు. సెల్‌టవర్ నుంచి వచ్చే రేడియేషన్‌తో పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. వారికి మద్దతుగా ఒకటో డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్, మాజీ వార్డు సభ్యుడు కుర్రి శివశంకర్ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

నాటడమెందుకు.. నరకడమెందుకు?



రోడ్డుపైకి వచ్చిన చెట్లను తొలగిస్తున్న దృశ్యాలు



మేడ్చల్: ప్రభుత్వాలు లక్ష్యాలను చేరుకోవడానికి ఆదరాబాదరగా చెట్లు నాటడం తీరా అవి పెరిగాక రోడ్లుకు అడ్డంగా ఉన్నాయని, కరెంట్ తీగల కింద ఉన్నాయని తొలగించడం పరిపాటిగా మారిపోయింది. ఇలాంటి ఘటనే గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో సాగుతోంది. గుండ్లపోచంపల్లి శివారు నుంచి అయోధ్య చౌరస్తా వరకు గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి రోడ్డుపైకి వచ్చాయి. దీంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అధికారులు రెండు రోజులుగా చెట్లను తొలగించి యంత్రాలతో శుభ్రం చేస్తున్నారు. రోడ్డుపైకి వచ్చిన చెట్లను తొలగించి వాహనదారులకు ఇబ్బందులను తొలగించడం మంచిపనైనా లక్షలు వెచ్చించి ఏళ్ళ తరబడి పోషించిన చెట్లను తొలగించడంతో అధికారుల అనాలోచిత చర్యలు బయట పడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా గుండ్లపోచంపల్లి–నూతన్‌కల్ రోడ్డులో అధికారులు మొక్కలు నాటారు. తమ టార్గెట్‌లను పూర్తి చేసుకోవడానికి రోడ్డుకు ఇరువైపులా అప్పటికే చెట్లు ఉన్నప్పటికీ రోడ్డుకు దగ్గరగా అప్పటి అధికారులు మొక్కలు నాటారు. దీనికి లక్షల రూపాయలు వెచ్చించారు. ప్రస్తుతం అప్పట్లో నాటిన మొక్కలు చెట్లుగా మారి రోడ్లపైకి రావడంతో వాటిని తొలగిస్తున్నారు. మొక్కలు నాటే సమయంలో ముందు ఆలోచనలు చేసి రోడ్డుకు దూరంగా నాటి ఉంటే వాటిని నేడు తొలగించాల్సిన పరిస్థితి వచ్చేది కాదు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ధనంతో మొక్కలు నాటే సమయంలో ముందుచూపుతో నాటాలని ప్రజల తరుపున డిమాండ్‌లు వినిపిస్తున్నాయి.